ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు
జిల్లా వార్తలు
5
శనివారం 16 ఆగస్టు 2025



జాతీయ పతాకం ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు



పేరేడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు





స్వాతంత్ర్య సమరయోధులు, వీర జవాన్ల కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న నాదెండ్ల మనోహర్, కలెక్టర్, ఎస్పీ

సమర్థంగా.. సంక్షేమం

- ప్రగతి సాధనలో పల్నాటి పౌరుషం చాటాలి
- 15 శాతం వృద్ధితో స్వర్ణాంధ్ర 2047 దిశగా అడుగులు
- రూ.25 కోట్లతో సాగర్, అనుపు పర్యాటక కేంద్రాల అభివృద్ధి
- స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్

నరసరావుపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): 'సంక్షేమం.. అభివృద్ధిని సమర్థవంతంగా అమలు చేయాలి. ప్రగతి సాధనలో అధికారులు పల్నాటి పౌరుషాన్ని చాటాలి..' అని మంత్రి నాదెండ్ల తెలిపారు. నరసరావుపేటలోని పోలీసు కవాతు మైదా నంలో జిల్లా స్థాయిలో స్వాతంత్ర్య దిన వేడుకలు శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. మంత్రి మనోహర్ జాతీయ జెండాను ఎగురవేశారు. గౌరవ వందనం స్వీకరించి సందేశమిచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకు వెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లా అభివృద్ధికి అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధన ద్వారా 2047 స్వర్ణాంధ్ర దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. నాగార్జున సాగర్, అనుపులను రూ.25 కోట్లతో పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. స్త్రీశక్తి ద్వారా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. రూ.5,028 కోట్ల పంట రుణాలు, 5,168 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 6,39,282 మందికి 25 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి మానసపుత్రిక పీ4లో 52,000 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవ ద్వారా 2,40,530 మంది రైతుల ఖాతాల్లో రూ.161.04 కోట్లు, తల్లికి వందనంలో 2.69 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.13 వేలు జమ చేశామన్నారు. మిరప సాగులో ఆధునిక పద్ధతుల అభివృద్ధి కోసం

(మిగతా 7వ పేజీలో)



సంక్షేమ శాఖ శకటం



ఉద్యాన శాఖ శకటం



వ్యవసాయ శాఖ శకటం



శంకరభారతీపురం స్కూల్ విద్యార్థినుల నృత్యం



సూక్ష్మ సేద్యం పరికరాలను పంపిణీ చేస్తున్న నాదెండ్ల మనోహర్

కోలాహలంగా వేడుకలు..



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు

లింగంగుంట్లలోని పోలీసు కవాతు మైదానంలో వేడుకలు కోలాహలంగా జరిగాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు, పోలీసు జాగిలాల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. స్వాతంత్ర్య సమరయోధులు, వీర జవాన్ల కుటుంబసభ్యులను సత్కరించారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. సూక్ష్మసేద్య పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. ఉత్తమ సాం స్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ స్టాల్స్‌లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. త్రివర్ణ బెలూన్లను మంత్రి నాదెండ్ల, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్ ధనుంజయ్ ఎగురవేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.



విద్యార్థుల పిరమిడ్ విన్యాసం

స్త్రీశక్తి.. సంబరం

ఉచిత ప్రయాణంపై అతివల ఆనందం

అట్టహాసంగా ప్రారంభం.. మహిళల కోలాహలం ● బస్సుల్లో జీరో టిక్కెట్ జారీ చేసిన ప్రజాప్రతినిధులు



పిడుగురాళ్ల బస్టాండ్‌లో స్త్రీశక్తి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తి



చిలకలూరిపేట : బస్సులో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



సత్తెనపల్లి బస్టాండ్‌లో ఎమ్మెల్యే కన్నా, శ్రీధర్



మాచర్లలో స్త్రీశక్తి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి



నరసరావుపేట నుంచి చిలకలూరిపేట వెళ్లే బస్సుల్లో మహిళలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) సూపర్ సిక్స్‌లో మరో పథకం స్త్రీశక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం జిల్లా అంతటా శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఉచిత ప్రయాణం హామీ అమలు ఎప్పడెప్పుడా అని ఎదురు చూసిన మహిళలకు స్వాతం త్ర్య దినోత్సవ కానుకగా ప్రభు త్వం స్త్రీశక్తికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడ లో స్త్రీ శక్తిని ప్రారంభించిన వెంటనే జిల్లా లోని డిపోల్లో ప్రజాప్రతినిధులు పథకాన్ని ప్రాంభిం చారు. ఉచిత ప్రయాణం అమల్లోకి రావడంతో అతివల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. బస్సుల్లో జీరో టిక్కెట్ జారీతో మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

నరసరావుపేట బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరా యలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, కలెక్టర్ పీ అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జేసీ సూరజ్ ధనుంజయ్, ఆర్డీవో మధులత, జిల్లా ప్రజారవాణా అధికారి టీ అజిత కుమారి ప్రారంభించారు. వినుకొండలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌తో కలిసి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేటలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్లలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, పెదకూరపాడులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్త్రీశక్తి పథకాన్ని మహిళల సమక్షంలో ప్రారంభించారు.



నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభిసుభిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్టీవో టీ అజితకుమారి



వినుకొండలో ప్రారంభిస్తున్న చీఫ్‌విప్ ఆంజనేయులు



పెదకూరపాడులో మహిళలకు జీరో టిక్కెట్ జారీ చేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ఉండవల్లిలో శ్రీకారం

- ఉచిత బస్సును ప్రారంభించిన చంద్రబాబు
- పవన్, లోకేశ్, మహిళలతో కలిసి విజయవాడకు సీఎం

తాడేపల్లి, మంగళగిరి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఉండవల్లి నుంచి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఉండవల్లి గుహాలయాల మినీ బస్టాప్ వద్ద నుంచి ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, మహిళా ప్రయాణికులతో కలిసి మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులో విజయవాడ బస్టాండ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణిస్తున్న మహిళల రోజువారీ ప్రయాణ అవసరాలు, కుటుంబ జీవనోపాధికి సంబంధించిన అంశాలను గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. పవన్‌కల్యాణ్ బస్సులో మహిళలతో సరదాగా కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ప్రయాణమార్గంలో ఉండవల్లి, భరతమాత సెంటర్, మణిపాల్ ఆస్పత్రి తదితర ప్రాంతాలలో ప్రజలు, కూటమి కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరి తమతమ పార్టీ పతాకాలతో ఉచిత బస్సులకు స్వాగతం పలికారు. మంగళహారతులతో మహిళలు స్వాగతం పలికగా పలుచోట్ల ప్రజలు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీజేపి చీఫ్ మాధవ్, కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



ఉండవల్లి నుంచి బస్సులో ప్రయాణిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్



జడ్పీ పాఠశాలకు ఎకరం స్థలం వితరణ

రెంటచింతల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలో బ్రిటీష్ కాలంలో స్థాపితమైన పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఇగుటూరి రాజశేఖరరెడ్డి ఎకరం స్థలాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఈ మేరకు ఆయన ప్రకటించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 1 నుంచి పదో తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలకు ఎంతోకాలంగా స్థల సమస్య ఉంది. ఈ క్రమంలో పాఠశాలకు సంబంధించి గతంలో 403 సర్వే నంబరులో ఉన్న 4.60 ఎకరాల స్థలంపై ముగ్గురు కోర్టుకు వెళ్లారు. ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ హయాంలో నాడు-నేడు పథకంలో రూ.1.35 కోట్లు మంజూరైనా స్థలం లేకపోవడంతో ఆ నిధులు వెనక్కువెళ్లాయి. ఈ క్రమంలో రాజశేఖరరెడ్డి ముందుకు వచ్చి రూ.15 లక్షలు విలువ జేసే స్థలాన్ని ఇవ్వడంతో పాఠశాలకు స్థల సమస్య తీరినట్లేనని పలువురు చెప్తున్నారు. రాజశేఖరరెడ్డి దాతృత్వాన్ని పలువురు అభినందిస్తున్నారు.

జీజీహెచ్‌లో.. ఆహార నాణ్యత

- పరీక్షా కేంద్రం ఏర్పాటుకు రూ.20 కోట్లు మంజూరు

గుంటూరు మెడికల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలకు రాష్ట్రస్థాయిలో రిఫరల్ కేంద్రంగా రూపుదాలుస్తున్న గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రాష్ట్రస్థాయి ఆహార నాణ్యత పరీక్షా కేంద్రం ఏర్పాటుకు వైద్య ఆరోగ్య శాఖ ఆమోదం తెలిపింది.



రూ.20 కోట్లతో ఈ ఆధునిక పరీక్ష కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు ఆహార పదార్థాల నాణ్యతా పరీక్షల నిమిత్తం పొరుగు రాష్ట్రాలకు నమూనాలు పంపిస్తున్నారు. ఇకపై రాష్ట్రంలోనే ఆహార నాణ్యత పరీక్షలు నిర్వహించే అవకాశం కలుగుతుంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ)తో కుదిరిన ఒప్పందం మేరకు కేంద్రం ఏర్పాటు జరగనున్నది. ఇటీవల పలు చోట్ల కల్తీ ఆహారం సంఘటనలు వెలుగుచూస్తున్న నేపథ్యంలో గుంటూరు జీజీహెచ్‌లో రాష్ట్ర స్థాయిలో ఫుడ్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం అన్ని రకాల ఆహార పదార్థాల నమూనాలను పరీక్షిస్తారు. 24 గంటల పాటు పనిచేసేలా సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు.

భోజనకుతూహలం

గడ్డల్ని కరిగించే కంద ఆకులు

సంస్కృతంలో కందకు 'సూరణం', 'వేరు వెల్లకి' అనే పేర్లు ఉన్నాయి. శూరుడిలా పోరాడేది కాబట్టి ఈ దుంపను సూరణం అంటారు. ఆయుర్వేద గ్రంథాల ప్రకారం- కడుపులో పెరిగే గడ్డలు, ఏలిక పాములపై ఇది పోరాడుతుంది. భౌగోళికంగా చూస్తే - కంద మొక్క దక్షిణాదివారి స్వంతం. ఉష్ణ ప్రాంతాల్లో ఎక్కువగా పెరిగే మొక్క ఇది! భారతదేశం మొత్తం మీద తెలుగు నేలపైన పెరిగే కందకు ప్రసిద్ధి ఎక్కువ. పూర్వం వానప్రస్థాశ్రమంలో కంద మూలాలు తింటూ జీవించేవారని చెప్పేవారు. కంద మూలాలంటే సాధారణ అర్థంలో దుంపకూరలని! కంద అనేది సంస్కృత పదం, దుంప అనేది తెలుగు. ఈ రకంగా చూస్తే కంద లాంటి దుంప కూరలు, ఇతర ఉడకబెట్టిన దుంపలు తింటారని అర్థం. ఇక కంద ఆకులు వెడల్పుగా పెద్దవిగా రెమ్మలురెమ్మలుగా ఉంటాయి. వీటిలో ఎ- విటమిన్, ప్రొటీన్లు, ఫైబర్ ఉంటాయి. ఇక కంద వల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం..



- కంద ఆకులకు వేడి చేసే స్వభావం ఉంటుంది. అయితే ఈ స్వభావం వల్ల కంద ఆకులు శరీరంలోని ఉన్న దోషాలను పోగొడతాయి. కఫదోషం వల్ల కలిగే వ్యాధులు ఉన్నవారికి ఈ ఆకులను వండిపెట్టవచ్చు.
- ఒకప్పుడు బోదవ్యాధి ఎక్కువగా ఉండేది. ఆ సమస్య ఉన్నవారికి కంద మంచి ఔషధం.
- కంద కాడల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇవి పొట్టను మృదువుగా చేస్తాయి.
- కంద ఆకులను ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువగా తింటారు. అయితే లేత కంద ఆకులను తింటేనే మంచిది. ముదురు ఆకుల్లో ఆగ్జలైట్ క్రిస్టల్స్ ఎక్కువగా ఉంటాయి. ముదురు ఆకులను నేరుగా తింటే కిడ్నీల్లో రాళ్లు ఏర్పడతాయి. ఒకవేళ ముదురు ఆకులను తినాలనుకొనేవారు ఆకులను శుభ్రపరచి, సన్నగా తరిగి, మజ్జిగలో వేసి బాగా మెత్తపడేదాకా ఉడికిస్తే ఈ క్రిస్టల్స్ తొలగిపోతాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

తళుక్కున మెరవాలంటే...

ముఖ చర్మాన్ని కాన్వాస్‌గా మలిచి, అందంగా తీర్చిదిద్దడమే మేకప్. అందుకోసం కొంత ఓర్పు, నేర్పు అవసరమవుతాయి. నాణ్యమైన ఉత్పత్తులను ఎంచుకోవడం ఒక ఎత్తైతే, వాటిని తగుమాత్రంగా ముఖానికి అద్దుకోవడం మరొక ఎత్తు. మెరుపులీనే తారలా తళుక్కుమనడం కోసం ఇవిగో ఈ మేకప్ కిటుకులు పాటించండి.



షేపింగ్: ముఖం కోలగా మలచాలన్నా, గుండ్రంగా తీర్చిదిద్దాలన్నా అందుకు తగిన మేకప్ మెలకువలు అనుసరించాలి. షాడో, బ్రాంజ్, కాంపాక్ట్‌ల షేడ్‌లను ఆచితూచి ఎంచుకుని, అవసరమైన చోటే అద్దుకోవాలి. ముక్కును తీర్చిదిద్దే తీరు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే దవడలు, చెవుల దగ్గర డెప్త్‌ను ఏ మేరకు పెంచాలో అంచనా వేయాలి.

ముడతలు: నుదురు, పెదవులు, కళ్ల కింది ప్రదేశాల్లో ముడతలు దాచడం కోసం అవసరానికి మించి కన్‌సీలర్ ఉపయోగించకూడదు. సహజసిద్ధమైన లుక్‌ను సొంతం చేసుకోవడం కోసం కళ్ల కింద ఎరుపు రంగు షేడ్‌ను పలుచగా అద్దుకుని, దాని మీద ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. కన్‌సీలర్‌ను పలుచగా అద్దుకుని, ఫౌండేషన్‌లో కలిసిపోయేలా చూసుకోవాలి.

హైలైట్: ముఖంలో కనుబొమలు, పెదవులు... ఇలా ప్రతి ఒక్కరి ముఖంలో ఏదో ఒక ఆకట్టుకునే అంశం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని సెంటర్ ఆఫ్ అటెన్షన్‌గా చేసి, దానికి తగ్గట్టు ముఖాన్ని మలిచే ప్రయత్నం చేయాలి. ఆకర్షణీయమైన కళ్లు ఉన్నవారు బోల్డ్ లైనర్‌ను ఉపయోగించాలి. పౌట్‌ను గుర్తించడం కోసం ముదురు రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి.

లైట్‌గా మొదలు పెట్టి: మేకప్ ఉత్పత్తులను వీలైనంత తక్కువగా వాడడం అలవాటు చేసుకోవాలి. కొద్దిగా కన్‌సీలర్‌ను చర్మం మీద అప్లై చేసి బ్రష్‌తో బ్లెండ్ చేసుకోవాలి. ఇంకొద్దిగా అవసరం పడితే, మళ్లీ అప్లై చేసుకోవాలి. అలాగే కన్‌సీలర్‌ను అప్లై చేయడం కోసం డో ఫుట్ అప్లికేటర్‌ను ఉపయోగించాలి.

ఐ షాడో బ్రష్: కనురెప్పల మీద ముడతలు ఉంటే, ఫ్లాట్ బ్రష్‌కు బదులుగా ఫ్లఫీగా ఉండే బ్రష్ వాడాలి. సన్నని మొన కలిగిన బ్రష్ వాడడం వల్ల షాడో, కనురెప్పల ముడతల్లో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చివర్లో క్రీజ్ బ్రష్‌తో అదనపు షాడోను తొలగించుకోవాలి.

పిల్లలు ఆలస్యంగా పడుకుంటున్నారా..?

పిల్లలు నిద్రకు ఉపక్రమించే సమయం, ఎన్ని గంటలు పడుకుంటున్నారనే అంశాలు వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాహారంతోపాటు సరైన నిద్ర కూడా అత్యవసరమని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు సమయానికి నిద్రపోవడం వల్ల కలిగే లాభాలు, ఆలస్యంగా పడుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం...



సమయానికి నిద్రిస్తే...

- పిల్లలు రోజూ సరైన సమయానికి నిద్రించడం వల్ల శారీరకంగా వారి ఎదుగుదల బాగుంటుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. నేర్చుకొనే సామర్థ్యం పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. తరచుగా ఒత్తిడికి గురికాకుండా భావోద్వేగాల పరంగా నియంత్రణలో ఉంటారు. ఆకలి పెరిగి చక్కగా ఆహారం తినగలుగుతారు. దీనివల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఎటువంటి వ్యాధులు రాకుండా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు.

ఆలస్యమైతే...

- నిద్ర సరిపోక కళ్లు, మెదడు అలసిపోతాయి. దీంతో పిల్లలు రోజంతా చిరాకుగా ప్రవర్తిస్తుంటారు. జీర్ణ సమస్యలు, ఆకలి లేకపోవడం, మలబద్ధకం లాంటివి ఎదురవుతాయి. కొంచెం పెద్ద పిల్లలకయితే ఏకాగ్రత కుదరదు. చదివిన అంశాలు గుర్తుండవు. పరీక్షలు సరిగా రాయలేక నిరాశ, ఆందోళనలకు గురవుతూ ఉంటారు. పిల్లలు ఆలస్యంగా పడుకుని, ఆలస్యంగా నిద్రలేస్తుంటే తల్లిదండ్రులు గమనించి ఆ అలవాటును మానిపించాలి.

ఏ సమయానికి పడుకోవాలంటే...

- చిన్న పిల్లలు రాత్రి ఎనిమిదింటికల్లా పడుకోవడం మంచిది. బడికి వెళ్లే పిల్లలు రాత్రి తొమ్మిది లోపు పడుకోవాలి. కనీసం ఎనిమిది నుంచి పది గంటలపాటు నిద్రించడం వారి ఆరోగ్యానికి మంచిది.

వంటిల్లు

కృష్ణునికి అటుకులు, పాలు, మీగడ, వెన్న అంటే ఇష్టమని మనందరికీ తెలుసు. కృష్ణాష్టమి రోజున వీటితో రకరకాల వంటకాలు తయారుచేసి కృష్ణునికి నివేదిస్తూ ఉంటాం. తక్కువ సమయంలో తేలికగా అటుకులతో తయారుచేసే రుచికరమైన నైవేద్యాల గురించి తెలుసుకుందాం...



• పాలు చిలకరించకుండా మరో నాలుగు చెంచాల నెయ్యి వేసి చేస్తే లడ్డూలు చాలా రోజుల వరకు నిల్వ ఉంటాయి.

అల్లరి కృష్ణునికి అటుకుల నైవేద్యం..!

అటుకుల లడ్డు

కావాల్సిన పదార్థాలు

అటుకులు- రెండు కప్పులు, నెయ్యి- అయిదు చెంచాలు, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని, ఎండు కొబ్బరిపొడి- రెండు చెంచాలు, యాలకులు- మూడు, తురిమిన బెల్లం- ముప్పావు కప్పు, కాచి చల్లార్చిన పాలు- మూడు చెంచాలు

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో అటుకులు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. వాటిని చల్లార్చాలి. స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో జీడిపప్పు పలుకులు, బాదం పలుకులు వేసి ఎర్రగా వేయించాలి. తరవాత ఎండు కొబ్బరి పొడి వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- మిక్సీలో చల్లారిన అటుకులు, యాలకులు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత బెల్లం తురుము వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జీడిపప్పు-బాదం పలుకుల మిశ్రమంలో వేసి బాగా కలపాలి. అందులో మూడు చెంచాల నెయ్యి వేసి కొద్దికొద్దిగా పాలు చిలకరిస్తూ ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దికొద్దిగా తీసుకుంటూ లడ్డూలు చుట్టుకోవాలి. అంతే..! కృష్ణునికి ఎంతో ఇష్టమైన అటుకుల లడ్డు రెడీ..!

• అటుకులను చిన్న మంట మీద నెమ్మదిగా వేయించుకోవాలి. లేదంటే తొందరగా మాడిపోతాయి.

అటుకులు పెసరపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

అటుకులు- ఒక కప్పు, పెసరపప్పు- అర కప్పు, బెల్లం- ఒకటింబావు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, కాచి చల్లార్చిన పాలు- మూడు కప్పులు, యాలకుల పొడి- అర చెంచా, కొబ్బరి ముక్కలు- కొన్ని, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పప్పులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో పెసరపప్పు వేసి దోరగా వేయించి మరో గిన్నెలోకి తీయాలి. అందులో నీళ్లు పోసి పెసరపప్పును రెండుసార్లు కడగాలి. తరువాత రెండు కప్పుల నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బెల్లం వేసి పావుకప్పు నీళ్లు పోయాలి. బెల్లం పూర్తిగా కరిగిన తరవాత స్టవ్ మీద నుంచి దించి మరో గిన్నెలోకి వడబోయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో కొబ్బరి ముక్కలు, జీడిపప్పు పలుకులు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లు వేసి ఎర్రగా వేపి పళ్లెంలోకి తీసుకోవాలి. తరువాత అటుకులు వేసి, దోరగా వేయించి మరో పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో నానబెట్టిన పెసరపప్పును నీళ్లతో సహా వేసి ఉడికించాలి. మధ్యలో ఒక చెంచా నెయ్యి వేసి కలపాలి. పెసరపప్పు మెత్తగా ఉడికిన తరువాత వేయించిన అటుకులు వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత పాలు పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అయిదు నిమిషాలు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. తరవాత బెల్లం నీళ్లు పోసి కలపాలి. మళ్లీ గిన్నెను స్టవ్ మీద పెట్టి రెండు నిమిషాలు మిశ్రమాన్ని ఉడికించాలి. అదే సమయంలో... వేయించి పెట్టుకున్న కొబ్బరిముక్కలు, జీడిపప్పు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లతోపాటు యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. అంతే! కమ్మని అటుకులు-పెసరపప్పు పాయసం నైవేద్యానికి రెడీ!

• పాయసాన్ని జారుగా ఉన్నప్పుడే స్టవ్ మీద నుంచి దించాలి. అది చల్లారిన తరవాత కొద్దిగా గట్టిపడుతుంది.



• బెల్లం నీళ్లు పూర్తిగా చల్లారిన తరవాతనే పాలు-అటుకులు-పెసరపప్పు మిశ్రమంలో కలపాలి. లేదంటే పాలు విరిగిపోవచ్చు.

- అటుకుల్లో ఎ, బి, సి, కె విటమిన్లతోపాటు ప్రోటీన్లు, పిండిపదార్థాలు, ఐరన్, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అటుకులను తరచూ తినడం వల్ల నీరసం తగ్గుతుంది. రక్తహీనత, జీర్ణ సమస్యలు, గుండె జబ్బులు దరిచేరవు. రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. అటుకుల్లో క్యాలరీలు, కొవ్వులు ఉండవు కాబట్టి ఎక్కువగా తిన్నప్పటికీ శరీరం బరువు పెరగదు. ఇవి త్వరగా జీర్ణమవుతాయి. అందుకే అటుకులను పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు బలవర్థకమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు.

సంకల్పం

నాట్యం... పరవశం



మూడు గంటలు భరతనాట్యం... మధ్యలో పావుగంట విరామం...
అలా ఏకధాటిగా 170 గంటల ప్రదర్శన..! సాధ్యమేనా..? అందరిదీ ఇదే సందేహం.
కానీ... అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించింది ఇరవయ్యేళ్ల రెమోనా ఎవెట్టే పెరీరా.
అమ్మ అండతో... స్నేహితులు, సన్నిహితుల ప్రోత్సాహంతో... ఈ మెగా ఫీట్‌ను దిగ్విజయంగా ముగించి...
'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించిన రెమోనా కథ ఇది.

"మాటల్లో చెప్పలేని భావాలను నాట్యంతో వ్యక్తీకరించవచ్చు. సంప్రదాయ నృత్యంలోని గొప్పదనం అదే. కాళ్లకు గజ్జె కట్టి, శరీరం లయబద్ధంగా కదులుతున్నప్పుడు నన్ను నేను మరిచిపోతాను. నర్తిస్తున్నంతసేపూ ఏదో తెలియని పరవశానికి లోనవుతాను. నేను అమితంగా ఇష్టపడింది, తొలిసారి ప్రేమలో పడింది భరతనాట్యంతోనే. కర్ణాటక రాష్ట్రం మంగళూరు నగరం మాది. ఊహ తెలియనప్పుడే మా అమ్మ నన్ను తీసుకువెళ్లి భరతనాట్యం గురువుకు అప్పగించింది. ఇక అప్పటి నుంచీ నాకు అదే లోకం అయిపోయింది. దీని వెనుక ఒక చిన్న కథ ఉంది. సంప్రదాయ నృత్యం అభ్యసించాలని మా అమ్మ ఎన్నో కలలు కన్నది. కానీ సామాజిక కట్టుబాట్ల పేరుతో ఇంట్లోవాళ్లు అనుమతించలేదుట. అందుకే నాకు కళలు నేర్పించాలని నిర్ణయించుకుంది. కానీ భరతనాట్యం వైపు వెళ్లమని తను నన్ను బలవంతం పెట్టలేదు. దీంతోపాటు పెయింటింగ్, ఇతర నాట్య రీతులు కూడా ఆరంభంలో సాధన చేశాను. అయితే ఎందుకో తెలియదు... అన్నిటికంటే నన్ను భరతనాట్యమే అమితంగా ఆకర్షించింది.



ఆలోచన అలా వచ్చింది...

ఆరంభం నుంచీ మా గురువు శ్రీవిద్య మురళీధర్ గారి దగ్గరే నాట్యం అభ్యసిస్తున్నాను. భరతనాట్యం నాకు ఒక సంప్రదాయ నృత్య సాధన మాత్రమే కాదు... భావోద్వేగాల బంధం. ఆధ్యాత్మిక అనుబంధం. నేను వేరు, నాట్యం వేరు కాదు. ప్రస్తుతం నేను బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. విద్య ఎంత ముఖ్యమో కళ కూడా అంతే ముఖ్యం. అందులో ఎప్పుడూ ఏదో కొత్తగా చేయాలని తపిస్తుంటాను. అలా ఒక రోజు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుంటే... 'డ్యాన్స్ మారథాన్' అని కనిపించింది. అలాంటిది ఒకటి ఉంటుందని కూడా అప్పటివరకు నాకు తెలియదు. ఆశ్చర్యం కలిగింది. నన్ను బాగా ఆకర్షించింది. 'నేను ఎందుకు ప్రయత్నించకూడదు' అనిపించింది.

అనుకున్నది 24 గంటలే... కానీ...

ఎప్పుడైతే ఆలోచన వచ్చిందో వెంటనే కార్యరంగంలోకి దిగాను. డ్యాన్స్ మారథాన్‌కు సంబంధించిన అప్లికేషన్ మా కాలేజీవాళ్లు తెప్పించారు. ముందుగా అనుకున్నది 24 గంటల మారథాన్. కానీ అప్లికేషన్ నింపుతుంటే... 170 గంటలు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఆ సంఖ్య నా మదికి ఎలా తట్టిందో తెలియదు. దరఖాస్తులో రాసే ముందు అమ్మకు చెప్పాను. తను అవాక్కయింది. కాసేపటికి తేరుకొని... 'అంటే ఎన్ని రోజులు' అని అడిగింది. 'సుమారుగా ఏడు రోజుల రెండు గంటలు' అన్నాను. ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ... 'నిజంగానే చేద్దామనుకొంటున్నావా' అంటే... 'అవును' అని బదులిచ్చాను. మరో ఆలోచన లేకుండా... 'అయితే నా మద్దతు నీకు ఉంటుంది' అంది అమ్మ.

ప్రత్యేక సన్నాహకాలు లేకుండానే...

ఈవెంట్‌కు కొన్ని వారాల ముందే 170 గంటలు నాన్‌స్టాప్‌గా భరతనాట్య ప్రదర్శన ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. దాంతో సన్నాహకాలకు ఎక్కువ సమయం లేకుండా పోయింది. అయితే నా మనసులో ఒకటే అనుకున్నా... 'వారం రోజుల పాటు నిద్ర ఉండదు. కనుక దానికి ముందు బాగా నిద్ర పోవాలి' అని. ఈ మారథాన్ కోసం నేను సన్నద్ధమైంది ఏదైనా ఉందంటే... అది కంటి నిండా కునుకు తీయడమే. చివరకు ఈవెంట్ రోజు, అంటే జూలై 21 వచ్చేసింది. ప్రదర్శన మొదలుపెట్టాను. మా కాలేజీ ఆడిటోరియంలోనే. నాకు తెలుసు... మొదటిరోజు హాయిగానే సాగిపోతుందని. మూడో రోజు నుంచి కష్టపడాల్సి వస్తుందని అనుకున్నా. కానీ నా అంచనాలు తలకిందులు అయ్యాయి. తొలి రోజే ఆపేద్దామనుకున్నా. అమ్మ 'నువ్వు చేయగలవు' అని ఆత్మవిశ్వాసం నింపింది. ఆడిటోరియంలో నా స్నేహితులు, స్థానికులు, అధ్యాపకులు... అందరూ నాకు అండగా నిలిచారు. నాకు నిద్ర వచ్చినప్పుడల్లా... చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ ఉత్సాహపరిచారు. మూడు గంటల నాట్యం... మధ్యలో పావుగంట విరామం. ఎక్కువగా అరటి, ఆపిల్, జామపండ్లు, కొబ్బరి నీళ్లతోనే సరిపెట్టుకున్నా. నిద్ర మరీ ముంచుకొస్తే ఒకటి రెండు సిప్‌లు కాఫీ. రాత్రి అయ్యేసరికి విపరీతమైన వెన్ను, కాళ్ల నొప్పులు. తట్టుకోలేక కళ్లల్లో నీళ్లు తిరిగేవి. అన్నిటికంటే పెద్ద సవాలు... నిద్ర ఆపుకోవడం. అన్నిటినీ భరించాను. అందరి సహకారంతో జూలై 28న విజయవంతంగా మారథాన్ ముగించాను.

అమ్మ లేకపోతే నేను లేను...

నా జీవితంలోనే కాదు... నా ఈ నాట్య ప్రయాణంలోనూ మా అమ్మ పాత్ర ప్రముఖమైనది. వెల కట్టలేనిది. నా ప్రతి దశలో తోడై, అడుగడుగునా ప్రోత్సహిస్తూ వస్తోంది. అంతేకాదు... నాట్య ప్రదర్శనకు అవసరమైన దుస్తులు తనే డిజైన్ చేసి, కుడుతుంది. అమ్మ నా నిశ్శబ్ద భాగస్వామి. నన్ను నలుగురిలో గొప్పగా నిలబెట్టడానికి అహర్నిశలూ కష్టపడుతుంది. తను లేకపోతే నేను లేను. నా మారథాన్ సమయంలో అమ్మ కూడా నిద్ర పోలేదు. సరిగ్గా తినలేదు. నిరంతరం నన్ను అంటిపెట్టుకొనే ఉంది.

సరికొత్త రికార్డు...

నా ప్రదర్శన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. రికార్డు నెలకొల్పాననే ఆనందం కన్నా... అంత పెద్ద లక్ష్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగాననేదే నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం నాకు ఇదే మొదటిసారి కాదు. గతంలో పిల్లలకు ఇచ్చే అత్యున్నత అవార్డు... 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నాను. నేను ఎక్కడ ఉంటే అక్కడ భరతనాట్యం ఉండేలా కృషి చేస్తాను. ప్రస్తుతం ట్రాన్స్‌జెండర్స్ పిల్లలకు నృత్యం నేర్పిస్తున్నాను. భరతనాట్యంలో పీహెచ్‌డీ చేయాలనేది నా కల. తద్వారా ఈ కళారూపాన్ని మరింత లోతుగా అర్థం చేసుకొనే అకాశం లభిస్తుంది కదా."

వ్యక్తిగత గౌరవం పెరిగేలా...

మనం వ్యక్తిగతంగా ఎదగడానికి మన అలవాట్లే దోహదం చేస్తాయి. ఒక్కోసారి తెలిసీ తెలియక చేసే పొరబాట్లు నలుగురిలో నగుబాటుకి గురిచేస్తూ ఉంటాయి. అలాకాకుండా సమాజంలో ఉన్నతంగా నిలవాలంటే ఏవిధంగా మెలగాలో తెలుసుకుందాం...

- కొంతమంది వ్యక్తిగతమైన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఉంటారు. గంట గంటకూ కామెంట్లు, లైక్‌లు చూస్తూ ఉంటారు. అనుకున్నట్లు జరిగితే సంతోషమే. కానీ అలా కానిపక్షంలో భావోద్వేగాల మీద నియంత్రణ కోల్పోతూ ఉంటారు. దీనివల్ల మానసికంగా అశాంతి, అసహనం, కోపం పెరుగుతాయి. ఇవి వ్యక్తిగత గౌరవాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే సామాజిక మాధ్యమాల్లో గడపడాన్ని తగ్గించుకోవాలి.
- కొంతమంది ఎప్పుడూ ఎదుటివారిలో తప్పులు వెతుకుతూ ఉంటారు. చిన్న చిన్న అంశాలనే పెద్దవిగా చేసి అనవసరమైన గందరగోళం సృష్టిస్తూ ఉంటారు. అలాకాకుండా తప్పు అనిపించిన అంశాన్ని నేరుగా మృదువుగా చెప్పడం మంచిది. దీనివల్ల నలుగురిలో సానుకూలంగా వ్యవహరించడం అలవడుతుంది.



- వాయిదా వేసే ధోరణి చాలామందిలో కనిపిస్తూ ఉంటుంది. మీటింగ్ లేదా ఫంక్షన్‌కి వస్తానని చెప్పి ఆఖరు నిమిషంలో రానని చెప్పడం, చేయాల్సిన పనులను ఎప్పటికప్పుడు వాయిదా వేయడం లాంటివి వ్యక్తిగత గౌరవాన్ని తగ్గిస్తాయి. కాలయాపన చేయకుండా క్రమశిక్షణతో మెలగడం అలవాటు చేసుకోవాలి.

సమర్ధంగా.. సంక్షేమం

(5వ పేజీ తరువాయి)

నకరికల్లులో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కొండవీడులో నగరవనం ఏర్పాటు జరుగుతుందన్నారు. వరికపుడిశెల ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి రూ.340.26 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది భారీ, చిన్న మధ్య తరహా పరిశ్రమల పెట్టుబడులు రూ.1608 కోట్లు రాగా మొత్తం 1,40,509 మందికి ఉపాధి కల్పించామన్నారు. బొల్లాపల్లిలో 70 ఎకరాలు, మాచర్లలో 20 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కులతో 8000 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. రెంటచింతలలో గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి 5 ఎకరాల కేటాయించామన్నారు. వినుకొండ, అమరావతి ప్రాంతాల్లో సామాజిక ఆరోగ్య కేంద్రాలను 30 పడకల ఆస్పత్రులుగా అభివృద్ధి చేయడంతోపాటు చంద్రన్న సంచార రథం ద్వారా 14 ఉచిత ల్యాబ్ పరీక్షలు, 105 రకాల మందులతో ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పల్లె పండుగలో 576 సీసీ రోడ్లు, 13 తారు రోడ్లు, 79 సైడు కాల్వలు, 13 మెటల్ రోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. కృష్ణా నదిపై మాదిపాడు వద్ద రూ.60.54 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

జాతీయ జెండా పట్ల అపారమైన గౌరవం ఉంది

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

వినుకొండటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తనకు దేశమంటే ఎంతో భక్తి అని, జాతీయ జెండా పట్ల అపారమైన గౌరవం ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. పంద్రాగస్టు వేడుకల కోసం లోపలికి వెళ్లే క్రమంలో ముగ్గును గమనించకపోవడం యాదృచ్ఛికంగా జరిగింది తప్ప ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని ఆయన శుక్రవారం వివరణ ఇచ్చారు. ఉదయం 8 గంటల లోపల వినుకొండ పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీలో గల కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో జరిగిన జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. జరిగిన తప్పిదంపై విచారణ వ్యక్తం చేశారు. జరిగిన తప్పిదాన్ని తెలుసుకున్న వెంటనే ఆయన సుమరు 10 నిమిషాల పాటు ప్రభుత్వ కార్యక్రమాలను ఆపుకొని.. పొరపాటు అని గ్రహించిన అనంతరం సరిదిద్దుకొని క్షమాపణ చెబుతూ తిరంగ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి దేశభక్తి కోసం పోరాడి స్పోర్ట్స్‌లో మొదటి స్థానం ఉన్నాని, ఇది రాజకీయం చేయడం తగదని కోరారు. ఇకపై మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నానని, జరిగిన ఘటనకు చింతిస్తూ జాతీయ జెండా గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడు అంకితభావంతో పనిచేస్తానన్నారు.

కో -ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు కార్యవర్గం ఎన్నిక

గుంటూరు సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు కో - ఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు కొత్త కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షుడిగా మహమ్మద్ ఇనాయతుల్లా, ఉపాధ్యక్షుడిగా బండారుపల్లి వేణుగోపాలరావు, కార్యదర్శిగా షేక్ మస్తాన్ వలి, జాయింట్ కార్యదర్శిగా పాశం సుబ్బారెడ్డి, కోశాధికారిగా గుండె పూడి హరిత శ్రావ్య ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నార్నె శ్రీనివాస్ చౌదరి, దొడ్డ ఓం ప్రకాష్, జొన్నలగడ్డ హేమావతి, కోలుకొండ వెంకట రాజేష్,మర్రిపూడి తంగెళ్ల ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఏబీటీయూసీ వెలుగూరి రాధాకృష్ణమూర్తి, కేవీఎస్ రవికుమార్ ఎన్నికైన వారిని అభినందించారు.

జీడి మామిడి తోటలోకి వచ్చిన జింక పిల్ల

బాపట్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు కాని బాపట్ల జీడి మామిడి పరిశోధన స్థానం జీడి తోటలో శుక్రవారం ఓ జింక సంచరించింది. అటు కలెక్టరేట్, ఇటు ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల మధ్యలో ఉన్న జీడి మామిడి తోటలో లేడి పిల్లను.. కుక్కలు వెంబడించాయి. అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకొని జింకను సంరక్షించాలని స్థానికులు కోరారు.

మహిళా సాధికారతలో మైలురాయి.. ఉచిత బస్సు ప్రయాణం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సాధికారత సాధనలో ఉచిత బస్సు ప్రయాణం మైలురాయిగా నిలిచిపోతుందన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఈపూరు మండలం కొచ్చెర్ల వద్ద ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్త్రీశక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ప్రయాణ చార్జీల రూపంలో నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఆదా చేయనున్న స్త్రీశక్తి పథకం రాష్ట్ర చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలసి వినుకొండ వరకు బస్సులో ప్రయాణించారు. బస్సులో మహిళలతో ఆయన మాట్లాడారు. ఉచిత ప్రయాణానికి జీరో ఫేర్ కింద మహిళలకు టికెట్లు ఇచ్చారు. అనంతరం వినుకొండ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని, సీఎం చంద్రబాబుకి ప్రతి ఒక్కరూ ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సగటున రోజుకు 25 లక్షల మంది మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా బస్సు ప్రయాణం చేసే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పథకం ప్రారంభించిన సీఎం చంద్రబాబును ప్రతిపక్ష ఎమ్మెల్యేలైనా అభినందించాలని, కానీ కోడిగుడ్డు మీద ఈకలు పీకాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. విమర్శలు చేస్తున్న వైసీపీ నాయకులు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని, గత ప్రభుత్వంలో 4 సార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచారని, ఎందుకు పెంచారో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


బస్సును ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

గుంటూరు నుంచి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ కారణంగా ఈ నెల 17, 19 తేదీల్లో గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 02881 భువనేశ్వర్ - యలహంక ప్రత్యేక రైలు 18 ఉదయం 8.35కి గుంటూరు, 9.20కి నరసరావుపేటకు చేరుకుంటుంది. 02882 యలహంక - భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈ నెల 19 సాయంత్రం 4.30కి గుంటూరుకు వస్తుంది.

కాకినాడ టౌన్, చర్లపల్లికి..


వారాంత రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, కాకినాడ టౌన్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు సీపీఆర్వో తెలిపారు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 22, 29 తేదీల్లో రాత్రి 7.30కి బయలుదేరి రాత్రి 12.05కి గుంటూరు చేరుకుంటుంది. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 17, 24, 31 తేదీల్లో రాత్రి 8.10కి బయలుదేరి రాత్రి దాటాక 1.40కి గుంటూరు, 2.23కి సత్తెనపల్లి స్టేషన్లకు వస్తుంది.

నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను సందర్శించిన డాక్టర్ నోరీ


పెట్ సీటీ స్కాన్‌ను పరిశీలిస్తున్న దత్తాత్రేయుడు

గుంటూరు మెడికల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధుల వైద్య సలహాదారుగా నియమితులైన ప్రఖ్యాత క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రఘునందన్‌తో కలిసి హాస్పిటల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న పెట్ సిటీ స్కాన్‌ని పరిశీలించారు. ఇన్‌స్టాలేషన్ పనులను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ఆయనకు వివరించారు. జనరల్ సర్జరీ ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ తదితర క్యాన్సర్ ట్యూమర్ వ్యాధులకు సంబంధించిన అన్ని కేసులకు ప్రభుత్వ సమగ్ర వైద్య శాల నాట్కో సెంటర్‌లోనే సమర్థంగా వైద్యం అందుబాటులో వస్తుందని దత్తాత్రేయుడు తెలిపారు. ఇన్‌పేషెంట్‌గా చేరే కేన్సర్ రోగులకు పెట్ సిటీ స్కాన్‌ని ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలోకి తెచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.

14 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల


14 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద కొనసాగుతూనే ఉంది. శుక్రవారం 1,44,694 క్యూసెక్కుల వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు 14 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 586.90 అడుగులు ఉంది. ఇది 304.98 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,394, 14 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,08,850, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1,44,694 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతలకు 1,36,992 క్యూసెక్కులు..

రెంటచింతల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్ పాండు విద్యుత్ ప్రాజెక్ట్ నుంచి పులిచింతలకు 1,36,992 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈలు సుబ్రహ్మణ్యం, సుబ్బారావు తెలిపారు. రెండు రేడియల్ క్రస్ట్‌గేట్లను 1.5 మీటర్లు, ఏడు గేట్లను 3.5 మీటర్ల మేర ఎత్తామన్నారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 1,38,496 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.43 మీటర్ల మేర నీరుండగా, 7.046 టీఎంసీలకు సమానమన్నారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైందని చెప్పారు.

సంగం డెయిరీ నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ


నూతన ఉత్పత్తులను విడుదల చేస్తున్న ఛైర్మన్ నరేంద్రకుమార్

ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించడంలో సంగం డెయిరీ ముందడుగు వేసిందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. డెయిరీలో నూతన ఉత్పత్తులను శుక్రవారం ఆవిష్కరించి మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. మైదాలేని బెల్లంతో తయారు చేసిన జోవర్ కాజు కుకీస్, రాగి బాదం కుకీస్, షుగర్ ఫ్రీ రాగి లడ్డు, సున్నుండలను విడుదల చేశారు. వీటిని తీసుకోవడంతో రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా నియంత్రించవచ్చని నరేంద్రకుమార్ తెలిపారు. పాలకవర్గ సభ్యులు, సీఈవో గోపాలకృష్ణ, సీఎఫ్‌వో పెద్ది సాంబశివరావు, సీవోవో పర్వతనేని అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సంగం డెయిరీలో స్వాతంత్ర్య దినోత్సవం

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరీ ఆవరణలో 79వ స్వాతంత్ర దినోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ వందన సమర్పణ చేశారు. డెయిరి ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు సరఫరా చేయడంలో భాగంగా నెలాఖరున విదేశీ పర్యటనను చెప్పట్టనున్నట్లు చెప్పారు. మిర్యాల గూడలో ఉత్పత్తిని ప్రారంభించామని, దేవరపల్లి, నాయుడు పేటలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డెయిరీ విస్తరణ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. డెయిరీకి వచ్చే లాభాలలోని ప్రతి రూపాయిని పాల ఉత్పత్తిదారులకు, ఉద్యోగులకు పంచడం జరుగుతుందని వివరించారు. సంగం పాలకవర్గం కేవలం డెయిరీకి కాపలాదారులం మాత్రమేనన్నారు. డెయిరీ రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించిన సందర్భంగా ప్రతి ఉద్యోగికి 5 రోజుల వేతనాన్ని బోనస్‌గా ఇవ్వడానికి పాలక వర్గం అమోదం తెలిపిందన్నారు. సుదీర్ఘకాలం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను, వారి అర్హతలను బట్టి అసైన్మెంట్ ఉద్యోగులుగా దాదాపు ఇప్పటివరకు 517 మందికి పదోన్నతులు కల్పించామని వివరించారు. పాల ఉత్పత్తి దారులకు ఒక కొత్త ఫార్మర్స్ యాప్‌ని అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని ఛైర్మన్ నరేంద్ర కుమార్ తెలిపారు. పాలక వర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేశం ఆనందించిన రోజు: జడ్పీ సీఈఓ


మాట్లాడుతున్న సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): బానిస సంకెళ్లతో అల్లాడిపోయిన భారత దేశం ఆనందించిన రోజు ఆగస్టు 15 అని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం జరిగింది. జడ్పీ వైస్ ఛైర్మన్లు బత్తుల అనురాధ, నర్సిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అవార్డులు పొందిన 20 మంది జడ్పీ సిబ్బందిని సీఈఓ, డెప్యూటీ సీఈఓ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో పీడీ వి.శంకర్ జెండా వందనం గావించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో పీడీ తలారి వెంకట విజయలక్ష్మి జెండాను ఆవిష్కరించారు.

30 వరకు బీఎస్సీ (హన్స్) ప్రవేశ గడువు

లాంఫాం(తాడికొండ)ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి బీఎస్సీ(హన్స్) కమ్యూనిటీ సైన్సు ఎన్.ఆర్.ఐ కోటాలో, బీఎస్సీ(హన్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 30వ వరకు పొడిగించినట్లు రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

పులివెందులలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు పరచి చూపాం

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


టైలరింగ్ షాపును ప్రారంభించి దుస్తులను కుడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

దాచేపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతలు పల్నాడులో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తామన్నారని..కానీ, కూటమి ప్రభుత్వం పులివెందులలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు పరచి చూపిందన్నారు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. 30 సంవత్సరాల తర్వాత పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో హత్యలు, తప్పుడు కేసులు, దాడులు, అరాచకాలు రాజ్యమేలాలయన్నారు. ఓడి పోయిన నేతలు ఆత్మ పరిశీలన చేసుకుంటారని కానీ, వైసీపీ నేతలు మాత్రం ఎన్నికల ముందు ఏ విధంగా ఐతే నోరు పారేసుకున్నారో ఎన్నికల తర్వాత కూడా అదే విధానంలో నడవటం వారికి ఎంత మాత్రం కూడా నైతిక విలువలు లేవని తెలుస్తుందన్నారు. వై నాట్ 175, వై నాట్ కుప్పం అన్నారని.. తాము వై నాట్ పులివెందుల అన్నాం, నెరవేర్చామన్నారు. వైసీపీ అధికారంలోకి వస్తే... రప్పా.రప్పా నరుకుతామన్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గుంతలతో ఉన్న రహదారులను అభివృద్ధి పరిచామని, అన్న క్యాంటీన్‌లు, తల్లికి వందనం , అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి పేరుతో ఉచిత బస్సులను నడుపుతున్నామని వివరించారు. పులివెందులలో ఎన్నికలపై నోరు పారేసుకుంటున్న వైసీపీ నేతలు.. గురజాల నియోజక వర్గంలో జడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీలు, మునిసిపల్ ఛైర్మన్‌లు ఏకగ్రీవం చేసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అప్పుడు వైసీపీ నేతలు ఏం చేశారో ప్రజలు గుర్తించారని, తగిన బుద్ధి చెప్పారన్నారు. నిన్న కాక మొన్న దాచేపల్లి హాస్టల్‌లో గొడవ జరిగితే దాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారు, తప్పుడు ఆలోచనలు, తప్పుడు బుద్ధులు ఉన్న వైసీపీ నేతలకు అంతకన్నా మంచి ఆలోచనలు ఏం వస్తాయంటూ ఎద్దేవా చేశారు. శ్రీనగర్ గ్రామంలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థికి తాము.. ఏటా రూ.50వేలు విద్యార్థి చదువుకు సహాయం అందిస్తున్నాం. మీరు ఏనాడైనా ఇలాంటి అభివృద్ధి పనుల చేశారా? అంటూ ప్రశ్నించారు. జగన్‌రెడ్డి చంద్రబాబు నాయుడు వయస్సు గురించి మాట్లాడుతున్నారని, ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు కూడా ఆ వయస్సులో ఉన్న వారు పదవులు చేస్తున్నారు, రాజశేఖరరెడ్డి బతికుంటే ఇదే వయస్సు ఉండేది కదా? ఇలాంటి తప్పుడు మాటలు మాట్లాడటం వైసీపీ నేతలకు చెల్లిందన్నారు. చంద్రబాబు నాయుడుకు ప్రధానమంత్రి పదవి అవకాశం వచ్చినా రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆయన ఆ పదవి జోలికి వెళ్ల లేదని వివరించారు.

బడుగు బలహీన వర్గాలకు దుకాణాలు

నారాయణపురంలోని బంగ్లా సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు షాపుల నిర్మాణానికి స్థలాలను మంజూరు చేయడంతో పాటు నూతన షాపులను ప్రారంభించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే యరపతినేని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పులుకూరి కాంతారావు, తంగెళ్ళ శ్రీనివాసరావు, బెల్లంకొండ బద్రి, నర్ర పుల్లయ్య, వినోద్‌రెడ్డి, తిరుమల కుమార్, బాలయ్య, సొసైటీ నారాయణ, నెల్లూరి రామ కోటయ్య, చింతపల్లి హసాన్ అహమ్మద్, తోట వెంకటేశ్వర్లు, పగడాల భాస్కరరావు, రుద్రాల అచ్చారావు, మునగ నిమ్మయ్య, కొప్పుల గిరి, బొమ్మిరెడ్డి సత్యం, ఐనాల శ్రీరాములు, కూరాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంగం జాగర్లమూడి సర్పంచ్‌కి..

రెండవసారి అరుదైన గౌరవం



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న సర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి

తెనాలి రూరల్, ఆగస్టు15(ఆంధ్ర జ్యోతి): మండలంలోని సంగం జాగర్లమూడి సర్పంచ్ పాలడుగు జయ నాగలక్ష్మికి రెండసారి ఢిల్లీలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అరుదైన గౌరవం దక్కింది. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్ల నిర్మాణం, శ్మశాన వాటిక ఆధునీకరణ, దోబీ ఘాట్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టి స్వచ్ఛ గ్రామం వైపు తీర్చిదిద్దేలా కృషి చేసింది. గత ఏడాది సైతం ఆమె సేవలను గుర్తించి ఢిల్లీలో ప్రసంసా పత్రం అందించారు. ఈ ఏడాది కూడా అందుకోవడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సర్పంచ్‌కి అభినందనలు తెలిపారు.

గురజాల ఆర్డీవో మురళీకృష్ణకు అవార్డు

గురజాలటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ఉత్తమ అధికారి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం నరసరావుపేటలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.


అవార్డు అందుకుంటున్న ఆర్డీవో మురళీకృష్ణ

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

రైల్ విహార్‌లో.. స్వాతంత్ర్య వేడుకలు

గుంటూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నల్లపాడులోని రైల్ విహార్‌లో స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం ఉదయం డీఆర్ఎం సుధేష్ణ సేన్ జాతీయ జెండాని ఎగురవేసి ఆర్‌పీఎఫ్ పరేడ్‌ని ఓపెన్ టాప్ వాహనంలో సందర్శించారు.

రెంటచింతలలో చోరీ

● 48 గ్రాముల బంగారం, రూ. 65 వేల నగదు అపహరణ


చెల్లాచెదురుగా ఉన్న బీరువా

రెంటచింతల, ఆగస్టు 15 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని ఓ పాఠశాల సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఉదయం 10 గంటలకు చోరీ జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున, బాధితుడి వివరాల మేరకు.. నారాయణపురం శ్రీనివాసరావు రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం 9 గంటల వరకు రేషన్ లెక్కలు చూసుకొని టైలరింగ్ పనికి వెళ్లాడు. 11 గంటలకు ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంటిలో ఉంచిన తాళాలను తీసుకొని బీరువా తలుపులు తెరిచి 48 గ్రాముల రెండు జతల చెవిజోళ్లు, రెండు ఉంగరాళ్లు, రెండు తాళిబొట్లు, పది తులాలుండే వెండి పట్టీలు, రూ. 65 వేల నగదును అపహరించుకుపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెంటచింతల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే 2020 జనవరి 28వ తేదీన ఈ ఇంటికి ఎదురుగా ఉండే మెడికల్ షాపు కోటిరెడ్డి ఇంట్లో చోరీ జరగగా రూ. 3 లక్షల నగదు, పది సవర్ల బంగారం, ఐదు తులాల వెండి అపహరణకు గురైంది. ఈ కేసును నేటికీ ఛేదించలేదు. ఈ నెల 4న మాస్టర్ జనార్దన్ ఇంట్లో చోరీ జరిగింది. ఇప్పుడు మరో దొంగతనం జరగడం స్థానికులను కలవరపాటుకు గురి చేస్తోంది.

యువకుడిపై కత్తితో దాడి

వినుకొండటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణం వెన్నపూస కాలనీకి చెందిన గనుపు నాగమయ్య అనే యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన పిడతల సుధాకర్ అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో బంధువులందరూ కలిసి మాట్లాడుతూ ఉండగా సుధాకర్ కత్తితో దాడికి తెగబడి అడ్డు వచ్చిన నాగమయ్యను పొడిచాడు. రక్తస్రావమై కుప్ప కూలిపోయిన అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైసీపీ నాయకులు పిడతల సుధాకర్, బాజీ, చిన్నబాబు, వెంకటరత్నం, దేవదాసు ప్రోద్బలంతో సుధాకర్ కత్తితో హత్యాయత్నం చేశాడని, దీనిపై వినుకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడి అన్న గనుపు కోటేశ్వరావు తెలిపారు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితుడు చికిత్స పొందుతున్నాడు.

గంజాయి విక్రయ ముఠా గుట్టు రట్టు


వివరాలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ హనుమంతరావు, సీఐ

నాదెండ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణా చేస్తూ గణపవరం, చిలక లూరిపేట ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతున్న గంజాయి ముఠా సభ్యులను శుక్రవారం చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.44 లక్షల విలువైన గంజాయితో పాటు 117 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చిలకలూరిపేట రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వివరాలను ఇన్‌చార్జ్ డీఎస్పీ హనుమంతరావు, రూరల్ సీఐ సుబ్బ నాయుడు విలేకరులకు వివరించారు. గణపవరంలో పలువురికి గంజాయి అమ్ముతున్నట్లుగా సమాచారం అందడంతో పోలీసులు నిఘా పెట్టారు. గణపవరం గ్రామ పరిధిలోని ప్రసన్న వంశీ కృష్ణ స్పిన్నింగ్ మిల్లు వద్ద గంజాయి అమ్ముతున్న ముఠా సభ్యులపై నాదెండ్ల పోలీసులు దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న ఏడుగురు అన్నంరాజు ఈశ్వర సాయి, నేలపాటి ఠాకూర్, షేక్ హుస్సేన్ బాషా, షేక్ బాజీ, హుస్సేన్ బాషా, షేక్ బాజీ, పల్లపు నాగలును అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద గంజాయి కొని సేవిస్తున్న మరో పది మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కిలోల 440 గ్రాముల గంజాయి, రూ.3,500 నగదు, సెల్ ఫోన్, 117 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన సీఐ సుబ్బ నాయుడు, ఎస్ఐ పుల్లారావులతో ఏఎస్ఐలు రోసిబాబు, పీవీ సుబ్బారావు, పి.రమేష్, కానిస్టేబుళ్లు దేవరాజు, శ్రీధర్, ప్రసాదు తదితరులను ఎస్పీ కె.శ్రీనివాసరావు అభినందించారని డీఎస్పీ తెలిపారు.

కోర్టు ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న న్యాయాధికారి ప్రవల్లిక తదితరులు

పిడుగురాళ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ కోర్టులో న్యాయాధికారి టి.ప్రవల్లిక జాతీయజెండా ఎగురవేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమారస్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు. గురజాల కోర్టులో న్యాయాధికారులు ప్రియదర్శిని, వై శ్రీనివాసరావులు జెండా ఎగురవేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీను, న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షిప్తం...

● మాచవరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో స్వాతంత్ర్యదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దారం అంబులమ్మ, పోలీసుస్టేషన్‌లో తిరుపతిరావు, పీహెచ్‌సీలో డాక్టర్ ప్రసాదరావు, ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో శ్రీధర్‌లు జాతీయజెండాలను ఆవిష్కరించారు. పాఠశాలల్లో, సచివాలయాల్లో జాతీయజెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో చిరంజీవి, డిప్యూటీ ఎంపీడీవో వెంగళరావు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం మండలం పీఏసీఎస్ చైర్మన్‌గా పసుపులేటి పూర్ణయ్య ఎన్నికయ్యారు. పర్సన్‌సభ్యులుగా పట్లవీటి పూరే సైదా, బాణావత్ కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు. పూర్ణయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే యరపతినేనికి కృతజ్ఞతలు తెలిపారు.

● దాచేపలి: స్వాతంత్ర్య వేడుకలు దాచేపల్లి మండలంలో ఘనంగా జరిగాయి. తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, కొప్పుల సుబ్బమ్మ, నడికూడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో బెల్లంకొండ భారతి వారి కార్యాలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో జండా వందనం చేశారు.

● రాజుపాలెం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉప ఎంపీడీవో పగడాల ముక్కంటి, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వీరయ్య, మహిళ పోలీస్ కె.విక్టోరియారాణి ఉత్తమ అవార్డు అందుకున్నారు.

● ప్రమాదశాత్తు వ్యక్తి వాగులోపడి మృతిచెందిన సంఘటన ఈ నెల 13న జరిగింది. మండలంలోని కోటనెమలిపురి గ్రామానికి చెందిన మేడ చాముండేశ్వరరావు(55) వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 13న కొండమోడు వెళ్లాడు. అప్పటికే వర్షంతో కోతులవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో చాముండేశ్వరరావు కొండమోడు నుండి వస్తున్న క్రమంలో వాగులో కొట్టుకుపోయాడు. శుక్రవారం చేపలుపట్టే వారు ఆయన మృతదేహన్ని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వేణుగోపాల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● అమరావతి: బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆలయ పవిత్రోత్సవాలు మూడోరోజు శుక్రవారం జరిగిన పూర్ణాహుతితో ముగిశాయి. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన సహాయ కమీషనర్ రేఖ, పి.నాగేశ్వరశర్మ పాల్గొన్నారు.

● వరదముంపు వలన పంటనష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నరుకుళ్లపాడు, ఎండ్రాయి, పలు గ్రామాలలో ముంపు వలన దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు పంటనష్టాన్ని అంచనా వేసి రిపోర్టును అందజేయాలన్నారు.

● అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మండలంలో ఉత్తమ సేవలు అందించిన తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చియ్య, సర్వేయర్ భాగ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ పద్మజ, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ సుబ్బారాయుడు, కానిస్టేబుల్ జాకోబ్‌బాబు, వీఆర్‌ఓ పాపారావులకు ఉత్తమ పురస్కారాలను మంత్రి మనోహర్ అందజేశారు.

● బెల్లంకొండ: మాజీ ఎంపీ ఎస్ఎం లాల్‌జాన్‌బాషా వర్ధంతిని బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్, పార్టీ నేతలు లక్ష్మీనారాయణ, జ్యోతి సముద్రం, రసూల్, సీతారామిరెడ్డి, కొండయ్య, వెంకట రామిరెడ్డి, మజీద్, సయ్యద్ జానీ, పాల్గొన్నారు.

● క్రోసూరు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా క్రోసూరు రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి ప్రశంసాపత్రాలు లభించాయి. తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు, సీనియర్ అసిస్టెంట్ భవిరిశెట్టి నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ జీ అనిత, ప్రశంసా పత్రాలు పొందారు.

● మండలంలోని ఊటుకూరు జడ్పీ హైస్కూల్‌లో గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థినులకు రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి వేగుంట రాణి నగదు బహుమతులు అందజేశారు.

● క్రోసూరు: స్వాతంత్ర్య వేడుకలు క్రోసూరు మండలంలో ఘనంగా జరిగాయి. తహసీల్దార్ కార్యాలయం, పోలీసుస్టేషన్, ఎంపీడీవో కార్యాలయం, క్రోసూరు హైస్కూల్, కేజీబీవీ, పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమాల్లో పలువురు అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ: బెల్లంకొండ 108 ఈఎంటీ అన్నవరపు గోపీ మంత్రి మనోహర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

● పెదకూరపాడు: మండలంలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్, పంచాయతీ,పాఠశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో సోమయాజులు, టీడీపీ మండల అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య, బాష్యం ఆంజనేయులు, ఏటుకూరి రత్నకుమార్, అధికారులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ: మండలంలోని శుక్రవారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో స్వాతంత్ర్యదిన వేడుకలను వైభవంగా నిర్వహించారు. బెల్లంకొండ పోలీసుస్టేషన్‌లో, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయం, కేజీబీవీ, దేవదాయశాఖ కార్యాలయంలో అధికారులు జెండా ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పద్మవెంకటేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

● కారంపూడి: ఉత్తమ వ్యవసాయాధికారిగా ఏవో పోట్ల నరసింహారావు శుక్రవారం నరసరావుపేటలో మంత్రి మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకున్నారు.

● విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ సిఅండ్‌బి ఏఈఈ హిమబిందు నరసరావుపేటలో మంత్రి మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అవార్డును అందుకున్నారు.

● కారంపూడి: మండలంలోని ఒప్పిచర్ల విద్యుత్‌శాఖ జూ నియర్ లైన్‌మెన్ షేక్ జానీబాషా ఉత్తమ అధికారి అవార్డు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింగరయ్య నుంచి అందుకున్నారు.

● దుర్గి: మండలంలోని పలువురు అధికారులు ఉత్తమ అధికారి అవార్డులకు ఎంపికయ్యారు. ఉత్తమ శిల్పి చెన్నుపాటి శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి పులిబండ్ల గోపి, ఏపీవో మల్లికార్జునరావు, పోలీస్‌స్టేషన్ రైటర్ గోపి ఉత్తమ అధికారి అవార్డులను నరసరావుపేటలో స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మనోహర్ నుంచి అందుకున్నారు.

● మండలంలో శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ సుధీర్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యేచూరి సునీతాసాయిశంకర్, మండల రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ యోబు, సొసైటీ కార్యాలయంలో చైర్మన్ కటకం రామారావులు జాతీయ జెండాను ఎగురవేశారు.

దేశంలో స్త్రీ శక్తి గొప్పది

● స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన యరపతినేని



పిడుగురాళ్లలో ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో అన్ని రంగాలలో మహిళలు రాణిస్తుండటం దేశం గొప్పతనమని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని శుక్రవారం పిడుగురాళ్ల ఆర్‌టిసి డిపోలో ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన అస్తవ్యస్త పాలనకు రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నా హామీలను ఒక్కొక్కటిగా సీఎం నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, మున్సిపల్ చైర్మన్ కెవి సుబ్బారావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, ఏఎంసి చైర్మన్ తురకా వీరస్వామి, వడ్లవల్లి సర్వేశ్వరరావు, నెల్లూరి నాగేంద్రం, చల్లగుండ్ల సీత, పాదర్తి రాజేశ్వరి, పరుచూరి వెంకటరమణ, గండికోట వెంకటేశ్వర్లు, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: లాల్‌జాన్‌భాషా టీడీపీకి, ముస్లిం మైనారిటీల సంక్షేమానికి కృషి చేశారని ఎమ్మెల్యే యరపతినేని గుర్తుచేశారు. లాల్‌జాన్‌భాషా వర్ధంతి సందర్భంగా శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, షేక్ సుభాని, కార్ సైదా పాల్గొన్నారు.

వాడవాడలా మువ్వన్నెల జెండా



పిడుగురాళ్లలో శాంతి కపోతాలను ఎగురవేస్తున్న యరపతినేని

పిడుగురాళ్ల, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవం వాడవాడలా శుక్రవారం జరిగింది. పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జడ్పీ హైస్కూల్‌లో ఎన్‌సిసి విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. శాంతికి నిదర్శనంగా కపోతాలను ఎమ్మెల్యే ఎగురవేశారు. ఆయా పాఠశాలల్లో 10వేల మందికి ఎమ్మెల్యే చాక్లెట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ కేవీ సుబ్బారావు, పాండురంగ శ్రీను, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, ఏఎంసి చైర్మన్ తురకా వీరస్వామి, జడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, పిల్లి చెన్నారావు, పణితి రవి, ఎల్‌వీఆర్, కనిగిరి శ్రీను, వడ్లవల్లి సాంబశివరావు, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్,ఖాశింసైదా, సయ్యద్ అమీర్‌అలి, వున్నం సురేష్, బొల్లా శ్రీను, జె.శ్రీను, తహసీల్దార్ మధుబాబు, ఎస్‌హెచ్‌ఓ వెంకట్రావు పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దయాకర్, సీఐ వెంకట్రావు, కమిషనర్ శ్రీనివాసులు, సబ్‌రిజిస్ట్రార్ పరణం నాగశైలజ తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

మహిళాభ్యుదయమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మహిళాభ్యుదయమే కూటమిప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా టీడీపి అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్‌లో శుక్రవారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిరువురు మాట్లాడుతూ మహిళలను మహాశక్తిగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు అనేక పథకాలు అమలు చేస్తున్నాడన్నారు. వారు మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో నేతలు యెలినేడి రామస్వామి, చౌటా శ్రీనివాసరావు, బీమినేని వందనాదేవి, కె.శోభారాణి, దరువూరి నాగేశ్వరరావు, మన్నవ శారదాదేవి, యెలినేడి లక్ష్మీతులసి, ఇంకొల్లు మారుతి, గద్దె అనురాద, టి. అంబిక, బి.రాజేశ్వరి, పూజల వెంకట కోటయ్య, మస్తాన్‌వలి, డిపో మేనేజర్ విజయ్‌కుమార్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎస్సీ కాలేజి బాలికల వసతిగృహంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగాఎమ్మెల్యే నోటుపుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు యెలినేడి రామస్వామి, చౌటా శ్రీనివాసరావు, దరువూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



గుంటూరులో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్‌ను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో వేడుకలను పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఎలినేడి రామస్వామి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాజీ ఎంపీ లాల్‌జాన్ బాషా వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, పూజల వెంకటకోటయ్య, గుంటూరు ఆశీర్వాదం, బండారు నాగరాజు, నూర్‌బాషా జాన్‌బాబు, అంబిక, రవిచంద్ర, బచ్చెబాబు, నబీ, బుడే, రాజ్యలక్ష్మి, వీరభాస్కరరెడ్డి, కొండలు పాల్గొన్నారు. డీఎస్పీ హనుమంతరావు, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి తమ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త సుధీర్‌భార్గవ్‌రెడ్డి పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో జక్కుల లక్ష్మీనారాయణ, ప్రసాదు పాల్గొన్నారు. తహసీల్దార్ చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు. నరసరావుపేటలో పట్టణానికి చెందిన సంఘసేవకులు తోట ఆంజనేయులు, గంజి వీరస్వామి మంత్రి, కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఎక్సైజ్ ఎస్ఐ నాగలక్ష్మి రాష్ట్ర ఎక్సైజ్‌శాఖకమిషనర్ ని శాంత్‌కుమార్‌నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

● ముప్పాళ్ళ: వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్ని ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల్లో జెండాను ఎగురవేశారు. తహసీల్దార్ నగేష్, ఎస్ఐ సోమేశ్వరరావు, డాక్టర్ రమాదేవి తమ కార్యాలయాల్లో జెండాను ఎగురవేశారు. నార్నెపాడు ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ కాకుమాను పూజ, డీఆర్‌డీఏ, వెలుగు ఏపీఎం బాలస్వామి శుక్రవారం నరసరావుపేటలో మంత్రి, కలెక్టర్‌నుంచి ప్రశంసాపురస్కారం అందుకున్నారు.

● రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామాలలో స్వాతంత్రవేడుకలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో నిర్వహించారు. తహసీల్దార్ సరోజ, ఎస్సై వేణుగోపాల్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యానారాయణలు జెండాలుఎగురవేశారు.

● నకరికల్లు: స్వాతంత్ర్య వేడుకల్లో శుక్రవారం నకరికల్లు పోలీసుస్టేషన్, చైత్రసెంటర్‌లో ఎస్ఐ సురేష్, తహసీల్దార్ కార్యాలయంలో కే పుల్లారావు జెండాను ఆవిష్కరించారు. కేజీబీవీలో ప్రిన్సిపల్ కే లక్ష్మీ, అన్ని ప్రభుత్వ పాఠశాలలు,సచివాలయాల్లో జెండాలను ఆవిష్కరించారు. నకరికల్లు మానిటరింగ్ సబ్ డివిజన్‌లో డీఈఈ లింగమూర్తి, ఎంపీడీవో కాశయ్య, డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాదు, జూనియర్ అసిస్టెంట్ ప్రసాదు, నరసింగపాడు పీఏస్ అప్పారావు మంత్రి నుంచి పురస్కారాలను అందుకున్నారు.

● సత్తెనపల్లి రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా జరిగింది. మార్కెట్‌యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి, ఏడీఏ రవిబాబు, ఏవో సుబ్బారెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, సీఐ సుబ్బారావు, ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్‌లలో చైర్మన్‌లు తమ కార్యాలయాల్లో జెండాను ఎగురవేశారు.

అమరవీరుల త్యాగఫలమే మనకు స్వేచ్ఛా వాయువులు

● ఎమ్మెల్యేభాష్యం ప్రవీణ్



అమరావతి: జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వేచ్ఛా వాయువులు ప్రసరించడం అమరవీరుల త్యాగఫలమే అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో జరిగిన వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా జాతీయ జండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అమరవీరులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా స్వాతంత్ర్యం కోసం పోరాడి అమరులు అయ్యారని వారి ఆశయాలను నెరవేర్చేలా ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం హనుమంతరావు, ఎంఈఓ శివబాబు, హెచ్‌ఎం విజయ, పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు, కూటమినాయకులు పాల్గొన్నారు.

మండల గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ డానియేలు, ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి హనుమంతరావు, సీఐ అచ్చియ్య, పీఏసీఎస్ అధ్యక్షులు తమ కార్యాలయాల్లో, ధాన్యబుద్ధ ప్రాంగణంలో మేనేజరు మణికుమార్ జండా ఆవిష్కరణ చేశారు.

● అచ్చంపేట: అచ్చంపేటలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బీజేపీ నాయకులు 30 అడుగుల జాతీయ జెండాతో భారీగా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో బీజేపీ మండల అధ్యక్షులు రమణారెడ్డి, ఉపాధ్యక్షులు భూక్యా కృష్ణా నాయక్, లక్ష్మణాచారి, స్వామి, చింతపల్లి వెంకటేశ్వర్లు, ప్రగతి పాఠశాల పాల్గొన్నారు. అచ్చంపేటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద, మండల పరిషత్ కార్యాలయం వద్ద, పీఏసీఎస్ కార్యాలయం వద్ద వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ బాయి, తహసీల్దార్ కే శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో అంబటి రమేష్, మండల టీడీపీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, పసుపులేటి పాపిరెడ్డి, కొప్పురావూరి కోటేశ్వరరావు, గంధం కోటేశ్వరరావు, చల్లా అనూపకళ, అంబటి నారాయణ, తిరువాయిపాటి ఆంజనేయులు, రాయిడి సాంబశివుడు, ఏవో వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఏఈ చిలుకా భాస్కర్, చంటి పాల్గొన్నారు.

● అచ్చంపేట: అచ్చంపేటలోని పశు సంవర్ధక శాఖ ఉత్తమ ఆఫీస్ సబార్డినేటర్‌గా ఎం నాగమణి బాయి శుక్రవారం నరసరావుపేటలోని జేడీ కార్యాలయంలో పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ పీ రామారావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

9వ సారి ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న శ్రీనివాసరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో వెల్దుర్తి మండల ఏఈగా పాశం శ్రీనివాసరెడ్డికి శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు చేతులమీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారు. మాచర్ల రూరల్ సీఐ షేక్ నఫీజ్‌బాషా రాష్ట్రస్థాయి సేవా పతకం అవార్డు అందుకున్నారు. మాచర్ల కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు ఉత్తమ అధికారి అవార్డు అందుకున్నారు. రెంటచింతల హెడ్ కానిస్టేబుల్ తిరుపాల్‌నాయక్ అవార్డును అందుకున్నారు.

● మాచర్లటౌన్: హజ్‌యాత్రకు వెళ్లే 72మంది ముస్లిం మైనార్టీలకి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం ప్రకటించడంపై ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీలు స్వీట్లు పంపిణీ చేశారు.

భువనచంద్ర చెక్కుడ్యామ్ నిర్మాణానికి సహకరించాలి

● ముఖ్యమంత్రి చంద్రబాబును కోరిన టీడీపీ నేతలు

రాజుపాలెం, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): భువనచంద్ర చెక్కు డ్యామ్‌ను వినియోగంలోకి తేవాలని టీడీపీ నాయకులు సీఎం చంద్రబాబును కోరారు. శుక్రవారం వారు సీఎంను కలిసి మొర పెట్టుకున్నారు. మండలంలోని బలిజేపల్లి గ్రామ సమీపంలో 25 ఏళ్ల క్రితం ఈ చెక్కుడ్యామ్ నిర్మాణం ప్రారంభించి 2019-20లో పూర్తి చేశారు. కానీ కాలువలు తీయటం పూర్తి కాలేదు. భూమి ఇచ్చిన రైతులు కోర్టుకు వెళ్లటంతో మధ్యలోనే ఆగిపోయింది. ఆ రైతులకు నష్టపరిహారం చెల్లించి చెక్కు డ్యామ్‌ను పూర్తిచేయాలని కోరారు. సీఎంను కలిసినవారిలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు నల్లమోతుల శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నిమ్మకాయల షేక్ అల్లాబక్షు, బాబావలి తదితరులు ఉన్నారు.

గవర్నర్‌కు ప్రకృతి ఆహారం పుస్తకం పరిచయం చేసిన జాజి

కారంపూడి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కారంపూడికి చెందిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(వనాల వృద్ధి, అడవుల పెంపకం) కొమెర అంకారావు అలియాస్ జాజి కలిసి తాను రచించిన ప్రకృతి ఆహారం పుస్తకంను పరిచయం చేశారు.



గవర్నర్‌కు ప్రకృతి ఆహారం పుస్తకం పరిచయం చేస్తున్న జాజి



అమరావతి: ఉచిత బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

సూపర్ సిక్స్ పథకాలతో కూటమి ప్రభుత్వం సక్సెస్

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తమ ఎన్నికల మ్యానిపెస్టోలో హామీ ఇచ్చినట్లు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తూ ప్రజలలో అభిమానాన్ని చురగొన్నదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం కార్యక్రమంలో భాగంగా అమరావతి బస్టాండ్‌లో ఉచిత బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బస్సులో మహిళలతో పాటు ప్రయాణించారు. తదుపరి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సక్సెస్ అన్నదానికి ఉదాహరణ పులివెందులలో టిడీపీకి లభించిన ఓట్లే నిదర్శనమన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు కార్యక్రమాల అమలుతో మహిళల్లో కూటమి ప్రభుత్వం పట్ల నమ్మకం కలిగిందన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళ్తూ గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిచేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని మహిళా నేతలు, ఐదు మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకుంటాం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులతో మాట్లాడి భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకుంటామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఊటుకూరులో మునిగిపోయిన పంటలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు, అమరావతి మండలాల్లో మునిగిపోయిన పంటలను వ్యవసాయ అధికారులతో కలసి పరిశీలించామని, అధికారులను నివేదిక కోరామని, ఉన్నతాధికారులతో వెంటనే మాట్లాడి పరిహారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించుకోవటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఊటుకూరు గ్రామం వద్ద మహిళలతో కలసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఎమ్మెల్యే వెంట తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి, జనసేన నాయకులు శాఖమూరి శ్రీను, టీడీపీ నాయకులు రోశయ్య, మొగల్‌జాన్, కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● పెదకూరపాడు: రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కంభంపాడు, పరస గ్రామాల్లో వరదకు నీట మునిగిన పంట పొలాలను, కోతకు గురైన రోడ్లను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం పరిశీలించారు.



మహిళలకు టిక్కెట్ అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మహిళా సాధికారితకు స్త్రీశక్తి పథకం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితకు కూటమి ప్రభుత్వ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీశక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి ఉచిత బస్సు టిక్కెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికలోటులో ఉన్నా ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దాదాపు 90 శాతం నెరవేర్చామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం వీరాస్వామి, కూటమి నేతలు మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, మార్కెట్‌యార్డు చైర్మన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్, యాగంటి మల్లికార్జునరావు, కొమెర దుర్గారావు, పంగులూరి పుల్లయ్య, లింగా రమేష్, యేచూరి సాయిశంకర్, జానకి రామయ్య, మహేష్, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, ఓర్సు క్రాంతికుమార్, తిక్కా కొండలు, చిన వెంకట్రామిరెడ్డి, కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, శాంతినాయుడు, జూలకంటి అక్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ అగ్రగామిగా భారత్

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి అన్ని రంగాల్లో అగ్రగామిగా భారత్ స్వతంత్రంగా ఎదుగుతోందని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్కు సెంటర్, మండల రెవెన్యూ కార్యాలయం, జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎంఈవో సురేష్, హెచ్ఎ ఉషారాణి, కూటమి నేతలు పాల్గొన్నారు.

● కారంపూడి: కారంపూడి పట్టణ, మండల పరిధిలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో శ్రీచక్ర సిమెట్ కర్మాగారంలో ప్లాంట్ ఇన్‌చార్జి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యాన జాతీయజెండాను ఆవిష్కరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, బ్రహ్మానాయుడు జడ్పీ హైస్కూల్ సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలునాయక్, ఎస్ఎంసీ చైర్మన్ బాలునాయక్ ఆధ్వర్యాన వేడుకలు జరిపారు. పోలీస్‌స్టేషన్లో ఎస్ఐ వాసు, మండల పరిషత్ కార్యాలయంలో గంట శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల శాఖలో ఏఈ యరపతినేని రామయ్య, డీసీ చైర్మన్ పంగులూరి అంజయ్య, టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిలు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

● రెంటచింతల: రెంటచింతల బస్టాండ్ సెంటర్లో టీడీపీ సీనియర్ నేత గొంటు ఆదివారెడ్డి, కట్టమూరి సోదరుల నేతృత్వంలో వేడుకలు జరిగాయి. అలాగే రామాలయం సెంటర్లో యేచూరి వెంకటసైదయ్య, పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి,తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మేరికనకం, ప్రిన్సిపాల్ మోహన్, టెయిల్ పాండ్ ప్రాజెక్ట్‌లో ఎస్ఈ వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వేడుకల్లో పాల్గొన్నారు.

● విజయపురిసౌత్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. లాంచీ స్టేషన్ లాంచీ యూనిట్ మేనేజర్ వినయతుల్లా జెండాను ఆవిష్కరించారు.



మంత్రి మనోహర్ నుంచి అవార్డును అందుకొంటున్న సీఈవో నాగప్రసాద్, మున్సిపల్ ఏఈ పి.ఆదినారాయణ, తహసీల్దార్ సురేష్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వినుకొండ అధికారులకు ఉత్తమ అవార్డులు

వినుకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో వినుకొండ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వినుకొండ తహసీల్దార్ సురేష్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ మురళీధరరావు, పట్టణ సీఐ శోభన్‌బాబు, సబ్ జైలర్ కృష్ణారావు, అటవీ శాఖ అధికారి మాధవరావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ స్మాయిల్, మున్సిపల్ ఏఈ పసుపులేటి ఆదినారాయణ, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ సహాయకులు టి.భాస్కరరావులు, ఉద్యాన శాఖ అధికారి నబీరసూల్, లు ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందారు. ఈ మేరకు నరసరావుపేటలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఆర్డీవో మధులత, ఇతర శాఖల ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

● శావల్యాపురం: సొసైటీ కార్యాలయ సీఈవోగా విధులు నిర్వహిస్తున్న జాలాది నాగప్రసాద్, కారుమంచి పీఏసీఎస్ సీఈవో వైవీ నారాయణ ఉత్తమ సేవాపురస్కారాన్ని అందుకున్నారు.

● రొంపిచర్ల: డీఆర్‌డీఏ ఏపీఎం సోమశేఖర్‌కు ఉత్తమ ఏపీఎంగా శుక్రవారం అవార్డు లభించింది.



మంత్రి నాదెండ్ల మనోహర్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న ఏఎస్పీ సంతోష్



చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



టీడీపీ కార్యాలయంలో జరిగిన జాతీయ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి తదితరులు



చీఫ్‌విప్ కార్యాలయం వద్ద జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

మహనీయుల త్యాగ ఫలం స్వాతంత్ర్యం: చీఫ్ విప్ జీవీ

వినుకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎందరో మహనీయుల పోరాటాలు, త్యాగాల ఫలం స్వాతంత్ర్యం అని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండలో 79వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని చీఫ్‌విప్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, కస్తూర్బా బాలికల విద్యాలయం, సచివాలయాల్లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.



జాతీయ జెండా రంగులతో విప్పర్ల వల్లభేశ్వరుడు

వెయ్యి అడుగుల త్రివర్ణ పతాక ప్రదర్శన

స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా వినుకొండ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగ ర్యాలీలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. నరసరావుపేట రోడ్డులోని తహసీల్దార్ కార్యాలయం నుంచి శివయ్య స్తూపం సెంటర్ వరకు 1000అడుగుల భారీ జాతీయజెండాతో ర్యాలీ నిర్వహించారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

నరసరావుపేట లీగల్ ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని, పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కంచి.శ్రీనివాస రావు, జాతీయ జెండాను ఎగురవేసి, ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బందితో కలసి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలోఅదనపు ఎస్పీ (అడ్మిన్) సంతోష్, అదనపు ఎస్పీ ఏఆర్.సత్తిబాబు, అదనపు ఎస్పీ (క్రైమ్) లక్ష్మీపతి, ఏ.ఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా న్యాయస్థానంలో 13వ అదనపు జిల్లా కోర్టు భవనంపై జాతీయ జెండాను 13 అదనపు జిల్లా న్యాయ అధికారి నేటి సత్య శ్రీ ఆవిష్కరించారు. మొదటి అదరపు జూనియర్ సలోమి, న్యాయవాద కార్యాలయం ఎదుట అధ్యక్షుడు సుబ్బారావు, పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ బి రవిలు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.



కోర్టు ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి నేతి సత్యశ్రీ



జేఎన్‌టీయుకే నరసరావుపేట కళాశాలలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ప్రిన్సిపాల్

● రొంపిచర్ల: తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బండి నిర్మల, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గడ్డం బాల నాగమ్మ జాతీయ జెండాలను ఎగుర వేశారు. విప్పర్ల వల్లభేశ్వరాలయంలో జాతీయ జెండాల రంగులతో స్వామి వారిని అలంకరించారు.

● వినుకొండ టౌన్: వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని కోర్టు ప్రాంగణంలో ఇంచార్జ్ జడ్జి నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆశీర్వాదం పాల్ జెండాను ఆవిష్కరించారు.

● శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ కార్యాలయంలో చైర్మన్ గడిపూడి విశ్వనాథం జాతీయ జండాను ఎగురవేసి జెండా వందనం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అర్జున్‌నాయక్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ లోకేశ్వరరావు, ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవోలు సాంబశివరావు, లలితా కుమారి జెండా వందనం చేశారు.

● యడ్లపాడు: మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకలలో పాల్గొన్న ఎంపీపీ ఝాన్సీదయాసాగర్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జాకీర్‌హుస్సేన్, ఏవో శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన వేడుకలలో తహసీల్దార్ విజయశ్రీ జెండా ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు.

● నరసరావుపేట టౌన్: ఎందరో త్యాగాల ఫలితమే మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోనిటీడీపీ నియోజకవర్గ, జిల్లా కార్యాలయాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● నసరావుపేట టౌన్: పట్టణంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా ముఖ్యఅతిథిగా హాజరయి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, కూనిశెట్టి లక్ష్మయ్య, బాయ్స్ హాస్టల్ ఇన్‌చార్జి వక్కలగడ్డ కోటేశ్వరరావు, బొలిశెట్టి రామమోహనరావు, బత్తుల వెంకట మురళీధరరావు, తాడేపల్లి వెంకట భావన్నారాయణ, రంజిత్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాససాయి, బీఎస్ రామకృష్ణంరాజు,అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలో పలుచోట్ల శుక్రవారం స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం, ఏరియా ఆసుపత్రి, వ్యవసాయమార్కెట్ యార్డ్, మునిసిపల్ హైస్కూల్, టీడీపీ కార్యాలయం, శారదా జిల్లా పరిషత్ హైస్కూలు, పండరీపురం మునిసిపల్ హైస్కూల్‌లో ప్రత్తిపాటి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. ఏఎంజి సంస్థలో సంస్థ డైరెక్టర్ అరుణ్ కుమార్ మహంతి, మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొన్నారు.



అమరావతికి విరాళం అందజేసిన నాగేంద్రమ్మను సత్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

● యడ్లపాడు: అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేసినందుకు మండల పరిషత్ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్‌కు, డిప్యూటీ తహసీల్దార్ అనూరాధకు ఉత్తమ సేవా పురస్కారాలు లభించాయి. జూనియర్ అసిస్టెంట్ శరత్, ఉన్నవ వీఆర్వో అశోక్ ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.

అధికారులకు సేవా అవార్డులు

ఈపూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ కార్యాలయాలలో పని చేసే ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం సేవా అవార్డులును మంత్రి నాదెండ్ల మనోహర్, కలెక్టర్ అరుణబాబు అందజేశారు. ఈపూరు సచివాలయం వెల్ఫేర్ కోటేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్‌లుకు సేవా అవార్డులు అందజేశారు.

స్త్రీ శక్తి పథకం ప్రారంభం



ఉచిత టిక్కెట్లను అందజేస్తున్న ఎంపీ లావు, కలెక్టర్, ఆర్టీసీ డీఎం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో స్త్రీ శక్తి పథకంను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ పీ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రారంభించారు. నరసరావుపేట నుంచి రావిపాడులోని అంకమ్మతల్లి అమ్మవారి ఆలయానికి ప్రయాణం చేశారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్‌చదలవాడ, కలెక్టర్ పీ అరుణ్ బాబు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య, కపలవాయి విజయకుమార్, కూటమి నాయకులు, మహిళలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపోలో శుక్రవారం స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం ప్రారంభించారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వాతంత్ర దినోత్సవం నాడు మహిళలకు కానుకగా ఈ పథకాన్ని అందించారని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఈ పథకాన్ని ప్రాంతంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చిలకలూరిపేట బస్ డిపో పరిధిలో మొత్తం 78 బస్ లు ఉండగా వాటిలో 55 పల్లెవెలుగు, 8 ఎక్స్ ప్రెస్ బస్ లలో మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణం చేయవచ్చని ఆయన చెప్పారు. బస్ డిపో మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు.



చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపోలో జెండా ఊపి స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

బొగ్గరం లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లు ధ్వంసం

ఈపూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గరంలో కొంకేరు వాగుపై నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్లను, విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. పొలాలకు సాగునీటిని విడుదల చేసేందుకు శుక్రవారం రైతులు లిఫ్ట్ వద్దకు వెళ్ళారు. అప్పటికే మోటార్లు ఉన్న గది తాళాలు బ్లేడ్‌తో కోసి వేశారు. గదిలోకి వెళ్ళి మోటార్ల వైర్లను కత్తిరించి ధ్వంసం చేశారు. 1987 సంవత్సరంలో బొగ్గరం, వేల్పూరు, గోగులపాడుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించారు. ఈ పథకంతో మూడు గ్రామాలలోని సుమారు 1910 ఎరాలకు సాగునీరు అందిస్తారు. ప్రస్తుతం పొలం పనులు ప్రారంభం కావడంతో సాగునీరు విడుదల చేసేందుకు రైతులు వెళ్ళగా మోటార్లు ధ్వంసం కావడంతో రైతుల ఆవేదన చెందుతున్నారు. దీనిపై రైతులు ఈపూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహంకాళి ఆలయంలో సామూహిక కుంకుమార్చన

నరసరావుపేట రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం శుక్రవారం పురస్కరించుకుని సామూహిక కుంకుమార్చన వరలక్ష్మీదేవి వ్రతం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి నరసరావుపేట పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులందరికీ పసుపు కుంకుమ గాజులు, అమ్మవారి శేషవస్త్రం లడ్డు ప్రసాదం అందజేశారు. అన్నప్రసాదం అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.మాధవీదేవి తెలిపారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో శ్రావణ మాసం శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. రొంపిచర్లలోని వాసవి, చౌడేశ్వరి, శంకరస్వామి, తిరుపతమ్మ తల్లి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. విప్పర్లలోని వల్లభేశ్వరస్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వరస్వామి, గోగులపాడులోని చంద్రమౌళీశ్వరస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు సంతగుడిపాడులోని వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో విశేష పూజలను నిర్వహించారు.